క్లుప్తంగా

రజక చెరువు ఆక్రమణలు తొలగించాలంటూ ధర్నా



ఆక్రమణలు తొలగించాలంటూ శెట్టిపేటలో ధర్నా చేస్తున్న రజకులు

నిడదవోలు రూరల్: శెట్టిపేటలోని రజక చెర్వు ఆక్రమణలను పూర్తిగా తొలగించాలని రాష్ట్ర రజక సంఘం ప్రధాన కార్యదర్శి చిలకలపల్లి కట్లయ్య డిమాండ్ చేశారు. రజకుల చెర్వుపై ఆక్రమించి నిర్మించిన భవనాలను మంగళవారం ఆయన పరిశీలించి ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం గ్రామశాఖ అధ్యక్షుడు అత్తిలి రమేష్, నాయకులు పి.అప్పలస్వామి, నారాయణ, వరప్రసాద్, రాజ్‌కుమార్, అవిడి సుబ్రహ్మణ్యం, జడ్డు రాంబాబు, కాపకాయల జయ తదితరులు పాల్గొన్నారు.

పుంతరోడ్డును అభివృద్ధి చేయాలి

చాగల్లు: గౌరిపల్లి పంట పొలాల్లోని పుంతరోడ్డును అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు. గౌరిపల్లి నుంచి వేములూరు గ్రామం వరకూ సుమారు రెండు కిలోమీటర్ల పొడవున్న ఈ పుంతరోడ్డు పూర్తిగా ఛిద్రమైంది. ఈ రోడ్డులో గౌరిపల్లి, పశివేదల, మల్లవరం గ్రామాల రైతులకు చెందిన వందలాది ఎకరాల పంట పొలాలు ఉన్నాయి. పుంతరోడ్డు అధ్వానంగా మారడంతో వ్యవసాయ ఉత్పత్తులను పొలాల నుంచి గ్రామాలకు చేరవేయడం ఇబ్బందికరంగా ఉంటోందని రైతులు చెబుతున్నారు. వర్షాకాలంలో అయితే బురదలోనే పంట పొలాలకు అవస్థలు పడుతూ వెళ్లాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు రోడ్డును అభివృద్ధి చేయాలని వారు కోరుతున్నారు.

120 మందికి కంటి వైద్య పరీక్షలు



కంటి వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

గోపాలపురం: మండలంలోని వాదాలకుంట గ్రామంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. రాజమహేంద్రవరానికి చెందిన అకిరా కంటి వైద్యశాల యాజమాన్యం ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని వాదాలకుంట జొన్నకూటి మనెమ్మ సందర్శించారు. రోగులకు అందిస్తున్న సేవలను ఆమె కొనియాడారు. ఈ శిబిరంలో సుమారు 120 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్ల జోళ్లు అందిస్తామని డాక్టర్ కె.శేషారత్నం తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎన్‌సీహెచ్ వెంకాయమ్మ, వీఆర్‌జే సేన అధ్యక్షుడు జె.మోహన్‌కుమార్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఉత్తమ సమాజ నిర్మాణంలో మానవ హక్కులు కీలకం

నల్లజర్ల: అంతరాలు, వివక్ష లేని ఉత్తమ సమాజ నిర్మాణంలో మానవ హక్కులు కీలకమైనవని ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల యూనియన్ జాతీయ కార్యదర్శి దూసనపూడి సోమసుందర్ అన్నారు. దూబచర్లలోని ఉపాధ్యాయశిక్షణ సంస్థ (డైట్)లో మంగళవారం మానవ హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎం.కమలకుమారి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి సోమసుందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ మానవ హక్కుల గురించి ప్రజల్లో అవగాహన విస్తృతంగా పెంపొందించాలన్నారు. ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల దినోత్సవాన్ని ప్రకటించడానికి గల కారణాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకుడు ఎస్ఆర్ సుబ్రహ్మణ్యం, అధ్యాపకుడు పీవీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్‌కు ఇన్వర్టర్, మోటార్ బహూకరణ



పోలీస్ స్టేషన్‌కు ఇన్వర్టర్, మోటార్ బహూకరిస్తున్న దాత గంగరాజు

గోపాలపురం: స్థానిక పోలీస్ స్టేషన్‌కు గోపాలపురానికి చెందిన దాత మద్దిపాటి గంగరాజు మంగళవారం ఇన్వర్టర్, మంచినీటి మోటార్ బహూకరించారు. తన తండ్రి మద్దిపాటి సత్యనారాయణ జ్ఞాపకార్థం రూ.35 వేల వ్యయంతో గంగరాజు వాటిని సమకూర్చారు. ఆయనను ఎస్సై కర్రి సతీష్‌కుమార్, పోలీస్ సిబ్బంది అభినందించారు.

టిడ్కో గృహాలకు నిధుల గ్రహణం

- నిడదవోలు, కొవ్వూరు పట్టణాల్లో అసంపూర్తిగా ఇళ్లు
- అసంపూర్తి నిర్మాణాలకు, మౌలిక వసతులకు నిధులివ్వని కూటమి సర్కార్
- పట్టణ పేదల సొంతింటి కల సాకారంపై నీలి నీడలు



కొవ్వూరులో అసంపూర్తిగా నిలిచి పోయిన టిడ్కో గృహాల సముదాయం

కొవ్వూరు: పట్టణ ప్రాంత పేదలకు అపార్ట్‌మెంట్ తరహాలో నిర్మిస్తున్న టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవడం లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు కావస్తోంది. ఇంతవరకూ అసంపూర్తిగా ఉన్న టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేయడంపై శ్రద్ధ పెట్టలేదు. దీంతో లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పడం లేదు. కొవ్వూరు పట్టణంలో 480 మందికి, నిడదవోలు పట్టణంలో 1,200 మంది లబ్ధిదారులకు టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. దాదాపు 80 శాతం నిర్మాణాలు పూర్తయ్యాయి. అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయించేందుకు ప్రభుత్వం నిధులు సమకూర్చడం లేదు. సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి నాయకులు, ఎమ్మెల్యే అభ్యర్థులు తాము అధికారంలోకి వస్తే లబ్ధిదారులకు తక్షణమే టిడ్కో ఇళ్లను అందించేందుకు చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. తీరా అధికారంలోకి వచ్చాక ఆ పనులను పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై కూటమి పాలకులు దృష్టి సారించక పోవడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఇప్పటికే రెండుసార్లు లబ్ధిదారులను వెంటబెట్టుకుని ఈ టిడ్కో ఇళ్లను పరిశీలించారు. త్వరలోనే వాటిని లబ్ధిదారులకు అందించేందుకు కృషి చేస్తామని ప్రకటించారు. నిడదవోలు నియోజకవర్గం నుంచి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయినప్పటికీ టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయించేందుకు నిధులు సమకూర్చలేకపోయారు. దీంతో లబ్ధిదారుల సొంతింటి కల సాకారం అయ్యే పరిస్థితి కనిపించడం లేదు.

రూ.27 కోట్లు అవసరం

నిడదవోలు, కొవ్వూరు పట్టణాల్లో టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేయడానికి రూ.27 కోట్లు అవసరమవుతాయని అధికారులు అంచనా వేశారు. వీటిలో కొవ్వూరుకు రూ.5 కోట్లు, నిడదవోలుకు రూ.22 కోట్లు కావాలని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఇంతవరకూ ఆ నిధులు విడుదల కాలేదు. ఈ పనులు పూర్తిచేయాలంటే గతంలో పనులు చేపట్టిన నిర్మాణ సంస్థ సాపూజీ–పానాంజీకి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద మొత్తంలో బకాయిలు చెల్లించాల్సి ఉంది. సుమారు రూ.1,000 కోట్ల వరకూ బిల్లులు పెండింగ్ ఉన్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఈ బకాయిలు చెల్లించి ఆ సంస్థ కాంట్రాక్ట్‌ను రద్దు చేస్తే గాని, కొత్తగా పనులు ప్రారంభించేందుకు వీలు లేదని అధికార వర్గాలు చెబుతున్నాయి. దీంతో లబ్ధిదారుల సొంతింటి కల సాకారం ఇప్పట్లో సాధ్యపడే పనికాదని తెలుస్తోంది.

మౌలిక సదుపాయాలకు రూ.17 కోట్లు

కొవ్వూరు, నిడదవోలు పట్టణాల్లో టిడ్కో ఇళ్ల సముదాయాల వద్ద మౌలిక సదుపాయాల కల్పనకు రూ.17 కోట్లు ఖర్చవుతుందని అధికారులు ప్రతిపాదనలు తయారు చేసి పంపించారు. దీనిలో నిడదవోలులో రూ.11 కోట్లు, కొవ్వూరులో రూ.6 కోట్లు అవసరమవుతాయని అధికారులు లెక్కలు తేల్చారు. ఈ టిడ్కో ఇళ్లను పట్టణ శివార్లలో పొలాల్లో నిర్మించారు. లబ్ధిదారులు అక్కడికి చేరుకోవడానికి రోడ్లు, వీధిలైట్లు, తాగునీటి సరఫరా, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, డ్రైన్ల నిర్మాణం వంటి పనులు చేపట్టాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఏవిధమైన నిధులూ విడుదల కాకపోవడంతో మౌలిక సదుపాయాల కల్పన అనే ఊసేలేదు.

ప్రతిపాదనలు పంపించాం

టిడ్కో ఇళ్ల సముదాయాల్లో అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి చేయించేందుకు రూ.27 కోట్లు ఖర్చవుతాయని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావాల్సి ఉంది. గతంలోని కాంట్రాక్టర్ టెండర్లను రద్దు చేస్తే తప్ప ఈ పనులు చేపట్టేందుకు అవకాశం లేదు. మౌలిక సదుపాయాల కల్పన నిమిత్తం రెండు పట్టణాల్లో రూ.17 కోట్లు అవసరమవుతాయని ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

–ఆర్.శేషగిరిరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఏపీ టిడ్కో

తీపర్రులో 150 మందికి గుండె వైద్య పరీక్షలు



గుండె వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

పెరవలి: పేదల ఆరోగ్యం కోసమే ఉచిత గుండె వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని, అవసరమైన వారు దీనిని సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ కేంద్ర కమిటీ సభ్యుడు కుందుల భూపతిరావు సూచించారు. తీపర్రు గ్రామంలో మంగళవారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. కుందుల భూపతిరావు ఆధ్వర్యంలో తణుకు పట్టణానికి చెందిన ఆపిల్ ఆసుపత్రి సౌజన్యంతో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో ఇద్దరికి ఆపరేషన్లు అవసరమని, మరో 15 మందికి మందులు సక్రమంగా వాడితే సరిపోతుందని గుండె వైద్య నిపుణుడు కోటేశ్వరరావు నిర్ధారించారు. ఈ శిబిరంలో రక్త పరీక్షలు, ఈసీజీ, ఎకో పరీక్షలు కూడా చేశామని ఆయన తెలిపారు. శిబిరంలో ఎంపీటీసీ సభ్యులు ర్యాలి వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ కోడూరి నారాయణరావు, కరాటం చిన్ని తదితరులు పాల్గొన్నారు.

రెండు ఓవర్‌లోడ్ ఇసుక లారీల సీజ్

తనిఖీ చేసిన ఆర్డీవో రాణి సుస్మిత



తాళ్లపూడి మండలం బల్లిపాడు ఇసుక ర్యాంపును పరిశీలిస్తున్న ఆర్డీవో రాణి సుస్మిత

కొవ్వూరు: అధిక ఇసుక లోడు తరలిస్తున్న రెండు లారీలను ఆర్డీవో రాణి సుస్మిత మంగళవారం పట్టుకున్నారు. ఔరంగాబాద్–2 ర్యాంపు నుంచి ఏలూరు వెళుతున్న ఇసుక లారీని ఆమె ఆపి బిల్లులు తనిఖీ చేశారు. అనుమానంతో లారీకి కాటా వేయించగా నిర్దేశిత పరిమాణం కంటే పది మెట్రిక్ టన్నుల ఇసుక అధికంగా ఉన్నట్టు తేలింది. అలాగే ఔరంగాబాద్ –2 ఇసుక ర్యాంపులో అధిక ఇసుక ఉన్న మరో లారీని కూడా గుర్తించి సీజ్ చేసినట్టు ఆర్డీవో తెలిపారు. సంబంధిత లారీ యాజమానులపైన, ఇసుక రవాణా చేస్తున్న వ్యక్తులపైనా ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సిందిగా పట్టణ పోలీసులను ఆర్డీవో రాణి సుస్మిత ఆదేశించారు.వాహనాల్లో నిర్దేశిత పరిమాణం కంటే అధికంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆమె హెచ్చరించారు. తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, ఏఎస్సై శ్రీనివాస్, ఇతర సిబ్బంది ఆర్డీవో వెంట ఉన్నారు. స్వాధీనం చేసుకున్న రెండు లారీలను టాస్క్‌ఫోర్సు అధికారులు, రెవెన్యూ అధికారులు పట్టణ పోలీసులకు అప్పగించారు.

బల్లిపాడు ఇసుక ర్యాంపులో మెషీన్ సీజ్

తాళ్లపూడి: నిబంధనలకు విరుద్ధంగా ఓపెన్ ఇసుక ర్యాంపుల్లో యంత్రాలు ఉపయోగిస్తే చర్యలు తప్పవని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత హెచ్చరించారు. ఇసుక తవ్వకానికి బల్లిపాడు ఇసుక ర్యాంపులో యంత్రాలను ఉపయోగిస్తున్నారంటూ ఆ గ్రామస్తులు చేసిన ఫిర్యాదు మేరకు ఆర్డీవో మంగళవారం ఈ ర్యాంపును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ర్యాంపులోకి మెషీన్ ఎందుకు తీసుకు వచ్చారని నిర్వాహకులను ప్రశ్నించారు. ర్యాంపులోని రహదారి వేయడానికి మాత్రమే మెషీన్ తీసుకు వచ్చామని, ఇసుక తవ్వకాలు చేపట్టలేదని నిర్వాహకులు బదులిచ్చారు. ఆర్డీవో మాట్లాడుతూ ఈ ర్యాంపులో కూలీలతో మాత్రమే ఇసుక తవ్వకాలు చేపట్టాల న్నారు. ర్యాంపులో ఏదైనా పనులు చేయాలంటే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. మెషీన్‌ను సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. డిప్యూటీ తహసీల్దార్ భారతి, ఎస్సై టి.రామకృష్ణ , రెవెన్యు సిబ్బంది ఉన్నారు.

తూరలు పూడుకుపోయి పారని సాగు నీరు



మోర్తలో ఆర్ అండ్ బీ రోడ్డు కింద తూరలు పాడైపోవడంతో రోడ్డు పక్కనే ఏర్పడిన గొయ్యి

ఉండ్రాజవరం: శిథిలావస్థకు చేరిన ఆర్ అండ్ బీ రోడ్డు కింద తూరలను తొలగించి, వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. మోర్త గ్రామంలోని కానూరు–లంకలకోడేరు రోడ్డులో కంటిపూడి లక్ష్మణరావు కోళ్లఫారం వద్ద గల ఈ తూరలు దెబ్బతిన్నాయని వారు పేర్కొన్నారు. సమస్యను పరిష్కరించాలని కోరుతూ ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వారు కలెక్టర్ ప్రశాంతికి వినతిపత్రం అందజేశారు. సుబ్బారాయుడు కాలువ నుంచి ఈ రోడ్డు కింద ఉన్న తూరల ద్వారా సుమారు 100 ఎకరాలకు సాగునీరు అందుతోందని వారు ఆవినతి పత్రంలో పేర్కొన్నారు. సుమారు 50 ఏళ్ల క్రితం వేసిన ఈ తూరలు పూర్తిగా పాడైపోవడమే గాకుండా వాటిలో పూడిక కూడా పెరిగిపోయిందన్నారు. దాంతో నీరు ముందుకు పారక ఆయకట్టు భూములకు నీరు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు కింద తూరలు విరిగిపోవడంతో రోడ్డుకు ఒక పక్కనే పెద్ద గొయ్యి ఏర్పడి, ప్రమాదకరంగా తయారైందని మోర్త రైతులు టీవీ కృష్ణారావు, వి.సత్యనారాయణ, ఎం.రామకృష్ణ, ఆత్మకూరి శ్రీనివాసు, వీఎస్ శ్రీనివాసు, కె.కృష్ణమూర్తి తదితరులు పేర్కొన్నారు.

వేలివెన్నులో భగవద్గీత పారాయణ



వేలివెన్నులో భక్తులతో భగవద్గీత పారాయణ చేయిస్తున్న దోర్బల ప్రభాకర శర్మ

ఉండ్రాజవరం: గీతా జయంతి సందర్భంగా మంగళవారం వేలివెన్ను గ్రామంలో భగవద్గీత సభ, హైందవ శంఖారావం నిర్వహించారు. అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖ పండితుడు దోర్బల ప్రభాకర శర్మ ప్రసంగించారు. భారతీయులందరూ భగవద్గీత పఠనం చేయాలని, గీతను బోధించే స్థాయికి ఎదగాలని ఆయనన్నారు. అనంతరం ఆయన భక్తులచే భగవద్గీత పారాయణ చేయించారు. వీహెచ్‌పీ సహ సంచాలకుడు భూపతిరాజు సుబ్బరాజు మాట్లాడుతూ జనవరి 5న విజయవాడలో నిర్వహించే హైందవ శంఖరావం సభకు హిందూ బంధువులు అందరూ తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో బుద్దాని శ్రీనివాసులు, విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి మెట్టపల్లి సుబ్బారాయుడు, వేలివెన్ను లలిత పారాయణ, అయ్యప్ప సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

నల్లజర్ల: ఈనెల 12 నుంచి రెవెన్యూ గ్రామ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ పి.కృష్ణారావు తెలిపారు. రెవెన్యూ పరమైన సమస్యలను ఈగ్రామ సభలలో పరిష్కరించుకోవచ్చన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ రెవెన్యూ గ్రామ సదస్సులు జరుగుతాయన్నారు. 12న అనుమునిలంక, 13న పోతవరం,16న అనంతపల్లి, వీరవల్లి,సంజీవపురం, 17న ఆవపాడు, 18న ప్రకాశరావుపాలెం, 19న తెలికిచెర్ల, 20న గుండేపల్లి, తూర్పుచోడవరం, 21న దూబచర్ల, 23న నల్లజర్ల, 24న మారెళ్ళమూడి, 25న చీపురుగూడెం, 27న పడమర చోడవరం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు.

నిర్మలగిరిలో సెమీ క్రిస్మస్ వేడుకలు

కేక్ కట్ చేసిన డైరెక్టర్ జాన్ పీటర్



సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్న డైరెక్టర్ ఫాదర్ జాన్ పీటర్

దేవరపల్లి: మండలంలోని ప్రముఖ క్రైస్తవ పుణ్యక్షేత్రం నిర్మలగిరిలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఫాదర్ జాన్ పీటర్ క్రిస్మస్ కేక్ కట్ చేశారు. ఇక్కడి అన్నదానం కాంట్రాక్టర్ కళ్లే నాగేశ్వరరావు, దిరిశిన ఫాతిమా, మేరిస్ నిర్మల హృదయ జూనియర్, డిగ్రీ కళాశాల సిస్టర్లు, నిర్మల ఇంగ్లిషు మీడియం స్కూల్ సిస్టర్లు, ఎల్ఏఆర్ సిస్టర్స్, శ్యామ్, శివ, అనిల్, దుర్గారావు, పండు, మోషే తదితరులు వేడుకల్లో పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. పాదర్ జాన్‌పీటర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిరలగిరి పుణ్యక్షేత్రంలో నివశిస్తున్న 1500 మందికి ఫాదర్ జాన్‌పీటర్ పండ్లు, రొట్టెలు అందజేశారు.

మొరాయించిన ఆర్వో ప్లాంట్

- ఐదు రోజులుగా మూడు గ్రామాలకు తాగునీటి సరఫరా బంద్
- అన్నవరప్పాడు, పిట్టల వేమవరం, మల్లేశ్వరం గ్రామాల్లో దాహం.. దాహం
- నిధులున్నా మరమ్మతుల్లో అధికారుల జాప్యంపై ప్రజల ఆగ్రహం



మూతపడిన పంచాయతీ ఆర్వో ప్లాంట్

పెరవలి: మండలంలోని అన్నవరప్పాడు పంచాయతీకి చెందిన ఆర్వో ప్లాంట్ మొరాయించింది. ఈ ప్లాంట్ నుంచి గురువారం రాత్రి నుంచి తాగునీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. 'మెషీన్ మరమ్మతుకు గురైంది. నీళ్లు అందుబాటులో లేవు' అంటూ పంచాయతీ సిబ్బంది ప్లాంట్ వద్ద బోర్డు ఏర్పాటు చేశారు. దాంతో అన్నవరప్పాడుతో పాటు పిట్టల వేమవరం, మల్లేశ్వరం గ్రామాల ప్రజలు తాగునీరు లభించక అల్లాడుతున్నారు. 15 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ ఆర్వో ప్లాంట్ మరమ్మతులు అవసరం. ఈ విషయాన్ని అన్నవరప్పాడు పంచాయతీ సర్పంచ్ పంతం బాల సుందరి మూడు నెలల క్రితమే ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ దృష్టికి తీసుకు వెళ్లారు. దాంతో ఆయన ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు మండల పరిషత్ నిధుల నుంచి రూ.2.20 లక్షలు మంజూరు చేశారు. నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ అధికారులు మరమ్మతులు చేపట్టకుండా నిర్లక్ష్యం వహించాలని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామస్తులు ఈ సమస్యను ఈఓపీఆర్‌డీ సీహెచ్ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి స్వప్నల దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లినా 'ఇదిగో చేసేద్దాం..అదిగో చేసేద్దాం' అంటూ కాలం వెల్లదీశారే తప్ప పనులు చేయించలేదు. మంచినీళ్లు సక్రమంగా రావడం లేదని, నలకలు వస్తున్నాయని నెల రోజులుగా పంచాయతీ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌కు, మండల ఇంజినీరింగ్ అధికారులకు తెలిపినా వారు పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి నుంచి మంచినీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. ఈ సమస్యపై గ్రామస్తులు రంగినీడి శంకర్, పులపర్తి కిషోర్ సోమవారం నాటి ప్రజాసమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ అచ్యుతకుమారి, ఎంపీడీఓ సీహెచ్ వెంకటరమణలకు అర్జీ సమర్పించారు. కాగా తాగునీటి సమస్యపై పంచాయతీ కార్యదర్శి స్వప్నను 'సాక్షి' వివరణ కోరింది. 'ఆర్వో ప్లాంట్ ఆగిపోయింది. చేయిస్తాం' అంటూ బదులిచ్చారు. ఎప్పుడు ఆగిపోయిందని ప్రశ్నిస్తే 'ఆగిపోయినట్టు నాకు శనివారం తెలిసింది' అన్నారు. మరి అప్పటి నుంచి చర్యలు తీసుకోలేదా? అని అడిగితే 'అవుతాయి.. ఏమిటి కంగారు' అంటూ సమాధానం చెప్పారు.

నిబంధనల ప్రకారం నీటి సంఘాల ఎన్నికలు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్ అచ్యుతకుమారి

పెరవలి: ఎన్నికల నియమావళి ప్రకారం సాగునీటి సంఘాల ఎన్నికల సిబ్బంది విధులు నిర్వహించాలని తహసీల్దార్ డి.అచ్యుతకుమారి సూచించారు. ఈ నెల 14న సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై మంగళవారం రెవెన్యూ, పంచాయతీ ఉద్యోగులు, డిజిటల్ అసిస్టెంట్‌లకు స్థానిక మండలం పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ అచ్యుతకుమారి మాట్లాడుతూ మండలంలో ఎన్నికలు నిర్వహించే కానూరు, పెరవలి, ఖండవల్లి సాగునీటి సంఘాల పరిధిలో 14,727 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఒక్కో సాగునీటి సంఘంలో సుమారు 5 వేల మంది ఓటర్లు ఉంటారన్నారు. వారందరూ సాగునీటి సంఘాల అధ్యక్షులను ఎన్నుకొంటారని తెలిపారు. సమావేశంలో ఇరిగేషన్ ఏఈ ఎన్ బాలమురళీకృష్ణ, ఎంపీడీఓ సీహెచ్ వెంకటరమణ, డిప్యూటీ తహసీల్దార్ సన్నిబాబు, ఆర్ఐ పావని తదితరులు పాల్గొన్నారు.

టీచర్స్ ఎమ్మెల్సీగా గోపిమూర్తి ఎంపికపై హర్షం



ఎమ్మెల్సీగా గోపిమూర్తి ఎంపికపై నల్లజర్లలో కేక్ కట్ చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

నల్లజర్ల: ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా బొర్రా గోపిమూర్తి విజయం సాధించడంపై యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు మంగళవారం నల్లజర్లలో హర్షం వ్యక్తం చేశారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మనోహరకుమార్ మాట్లాడుతూ ఈ విజయం చారిత్రాత్మకమైందన్నారు. పీడీఎఫ్ అభ్యర్థులను వరుసగా మూడుసార్లు ఎమ్మెల్సీగా గెలిపించడం ఉపాధ్యాయుల ఐక్యతకు చిహ్నమని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షులు ప్రకృద్దీన్, కార్యదర్శి బండి కిశోర్, అసోసియేట్ అధ్యక్షుడు టి.నాగేశ్వరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. జిల్లా కార్యదర్శి నల్లజర్ల భవాని ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.

ఉండ్రాజవరం: ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బొర్రా గోపిమూర్తి విజయం సాధించడంతో మండలంలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో మంగళవారం ఉపాధ్యాయులు విజయోత్సవాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు ఐ.రాంబాబు, గౌరవా ధ్యక్షుడు ఎస్.లక్ష్మీనారాయణ, అధ్యక్షుడు వైవీ స్వామి, ఎస్.తాతారెడ్డి, వెంకటలక్ష్మి, బి.రామారావు, కె.రామకృష్ణ మాట్లాడుతూ సరెండర్ లీవ్ బకాయిలు, పీఆర్సీ బకాయిలు చెల్లించాలని, ఐఆర్ ప్రకటించాలని, సీపీఎస్ రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

బీమా యోజనను సద్వినియోగం చేసుకోవాలి

గోపాలపురం: ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.రాజారావు సూచించారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనపై రైతులకు మంగళవారం గంగోలు సచివాలయం వద్ద అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ పథకం కింద వరి, మొక్కజొన్న సాగు చేసే రైతులు పంటల బీమా చేయించుకోవాలన్నారు. వరికి ఎకరాకు రూ 630, మొక్కజొన్నకు రూ. 540 చొప్పున ఈనెలాఖరులోగా బీమా ప్రీమియంగా చెల్లించాలన్నారు. గంగోలు, హుకుంపేట, రాంపాలెం, యర్రవరం గ్రామ రైతులు పాల్గొన్నారు.

మహిళల రక్షణపై అవగాహన

నిడదవోలు: ఇటీవల మహిళలపై దాడులు, హత్యాచారాలు జరుగుతున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు పట్టణంలో వివిధ సెంటర్లలో మంగళవారం పోలీస్ మహిళా రక్షక్ బృందం అవగాహన కల్పించారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర కళాశాల విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈవ్ టీజింగ్‌కు ఎవరైనా పాల్పడితే దానిని ఎలా ఎదుర్కోవాలి? ఎవరికి ఫిర్యాదు చేయాలనే ఆంశాలను వివరించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్లలో మహిళలపై దాడులు జరిగితే, వాటిని ఎలా ఎదుర్కోవాలనే అంశాలను వివరించారు. కార్యక్రమంలో హెచ్‌సీ వెంకటేశ్వరరావు, మహిళా కానిస్టేబుల్స్ శైలజ, సంధ్య, ప్రసన్న పాల్గొన్నారు.